www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

స్పైసీ హోటల్‌పై విద్యుత్ శాఖ మౌనం ఎందుకు?



వైభవంగా కోటమైసమ్మ జాతర!



హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 265, ఆదివారం 25-10-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చలు

సోమవారం ముంబయికి సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 24:

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ముంబయిలో చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ముంబయి వెళ్లనున్నారు. తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొనున్నారు.



కేఆర్ఎంబీ సమావేశం వాయిదా

మరోవైపు సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. అదేరోజు ముంబయిలో మహారాష్ట్ర సీఎంతో రేవంత్‌రెడ్డి సమావేశం ఉన్నందున వాయిదా వేయాలని తెలంగాణ కోరింది. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేఆర్ఎంబీ సమావేశాన్ని వాయిదా వేశారు. సోమవారం జరగాల్సిన కృష్ణా బోర్డు సమావేశం మంగళవారానికి వాయిదా వేసింది.

నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు

సాగునీటి ప్రాజెక్టులపై శుక్రవారం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశంలో భాగంగా తుమ్మిడిహెట్టిపై ప్రధానంగా చర్చించారు. 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించేందుకు అవసరమైన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను సీఎం ఆదేశించారు.

గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకొనే వీల్లేదని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు సిద్ధమవుతోంది. అందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలని ఇప్పటికే అధికారులకు సూచించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలు, వాదనలను సమర్థవంతంగా వివరించనున్నారు.

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది

మరోవైపు రాష్ట్ర ప్రజల కష్టాలకు కారణమైన బీఆర్ఎస్ నేతలే ప్రస్తుతం అబద్ధాలు చెబుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలోనే మేడిగడ్డ బ్యారేజ్ కూలిపోయిందని, కేసీఆర్ తీరు వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో పరిస్థితులు ఉన్నాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

"మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారు. సీకెంట్ పైల్స్ వాడకం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో సమస్యలు వచ్చాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో గేట్లు మూయవద్దని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. బ్యారేజీల గేట్లు మూయకుంటే పంపులు రన్ చేసే అవకాశమే లేదు. కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. బ్యారేజీ నిర్మాణానికి ఎంత కాంక్రీట్ అవసరమైందో, అంతే కాంక్రీట్ మరమ్మతులకు అవసరం" – ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి

ఎల్‌నినో వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు చేసే విషప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని మంత్రి పేర్కొన్నారు.



రక్షణ రంగంలో భారత్‌ను అగ్రగామిగా చూడాలన్నదే నా ఆకాంక్ష

సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 24

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా 'రక్షా ఎక్స్‌పో-2026'ను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నగరంలోని తాజ్ ఫలక్‌నుమాలో నిర్వహించిన 'రక్షా ఎక్స్‌పో-2026' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు రక్షణ రంగ నిపుణులు, సాయుధ దళాల అధికారులు, డిఫెన్స్ కంపెనీల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం. అంతర్జాతీయ వేదికపై రక్షా ఎక్స్ పోను తీర్చిదిద్దాలన్నది నా ఆలోచన. హైదరాబాద్ ఒక వ్యూహాత్మక ప్రదేశంగా దేశంలో కీలకమైన స్థానంలో ఉంది. హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరం. సమద్రం లేకపోయినా నౌకాదళానికి రాష్ట్రం కీలకమైన సేవలు అందిస్తోంది. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా తీర్చిదిద్దాం. రక్షణ రంగంలో భారత్‌ను అగ్రగామిగా చూడాలన్నదే నా ఆకాంక్ష. రక్షణ సాంకేతిక ఎగుమతులు చేసే దేశంగా భారత్ ఎదగాలి. రక్షణ రంగ పరిశ్రమలకు తెలంగాణ అతిపెద్ద కేంద్రం కావాలని ఆకాంక్షించారు.

కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్

అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

కేంద్ర ప్రాయోజిత పథకాలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 24:



కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి అందాల్సిన నిధులను సత్వరమే రాబట్టి, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, నిధుల ..మిగతా 3లో

ట్యాంకర్ల ద్వారా నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు



నవంబర్ 1 నుంచి నిబంధనల ఉల్లంఘనకు రూ.5 వేల జరిమానా

రెండోసారి ఉల్లంఘనకు పాల్పడితే ట్యాంకర్ రిజిస్ట్రేషన్ రద్దు

నీటి లీకేజీలు ఉన్న, మూతలు సరిగా లేని ట్యాంకర్లలో నీటి నింపుదల నిలిపివేత

ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద పకడ్బందీ పర్యవేక్షణకు అధికారులకు ఆదేశాలులి

ప్రతి నీటి బొట్టును సంరక్షించడమే లక్ష్యం: జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 24:

నగరంలో తాగునీటి వృథాను అరికట్టేందుకు జలమండలి చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తోంది. ముఖ్యంగా ట్యాంకర్ల ద్వారా నీటి రవాణా సమయంలో జరుగుతున్న వృథాను నివారించేందుకు ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి అక్టోబర్ 24న సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.జలమండలి పరిధిలోని కొన్ని నీటి ట్యాంకర్లలో సామర్థ్యానికి మించి నీటిని నింపడం, మరికొన్ని ట్యాంకర్లకు మూతలు లేకపోవడం లేదా వాటిని సరిగా మూసివేయకపోవడం వల్ల రవాణా సమయంలో నీరు రహదారులపై వృథాగా పోతున్నట్లు జలమండలి ..మిగతా 2లో

కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం

మేడిగడ్డ వద్ద వృథాగా దిగువకు ప్రవహిస్తున్న నీటిని వినియోగంలోకి తీసుకురావాలి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మేడిగడ్డ, అక్టోబర్ 24:

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవాలను ప్రజలకు వివరించడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా వినియోగంలోకి తీసుకురావాలనే డిమాండ్‌తో శనివారం మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రాజెక్టు వద్ద నీరు దిగువకు వృథాగా ప్రవహిస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. మేడిగడ్డ వద్ద ఇప్పటికే సుమారు 751 టీఎంసీల నీటిని దిగువకు వదిలేశారని తెలిపారు. అందులో 200 టీఎంసీల నీటిని ఎత్తిపోసి వినియోగంలోకి తీసుకొచ్చినా హైదరాబాద్ తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు, రైతులకు సాగునీరు అందించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు.ప్రస్తుతం సీఎం మేడిగడ్డ వద్ద సుమారు 22 వేల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోందని, ఈ నీటిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోసి ..మిగతా 2లో



పి.ప్రభాకర్ రెడ్డి- డి.ఎస్ఈ- జూరాల ప్రాజెక్టు ఎస్ఈ కార్యాలయం

జూరాల ప్రాజెక్టు ఎస్ఈ కార్యాలయంలో రికార్డుల దగ్ధం.. కలకలం

జోగులాంబ గద్వాల

అక్టోబర్ 24:

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గల జూరాల ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) కార్యాలయంలో రికార్డులు దగ్ధమైన ఘటన కలకలం రేపుతోంది. కార్యాలయంలో భద్రపరిచిన పాత రికార్డులను ఒక ఉద్యోగి కార్యాలయం బయట కాల్చివేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఈ కార్యలయం రికార్డు అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఈశ్వరయ్య డివిజన్ -1 బదిలీ పై వెళ్లారు. అతని స్థానంలో వచ్చిన దినేష్ అనే ఉద్యోగికి రికార్డులు అప్పజెప్పాల్సి ఉంది. అయితే జూరాల ప్రాజెక్టు నిర్మాణం నాటి నుంచి ఇప్పటివరకు సంబంధించిన అనేక ముఖ్యమైన పత్రాలను బదిలీపై వెళ్లిన ఉద్యోగి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా తగలబెట్టినట్లు సమాచారం. అందులో ఒరిజినల్ సంతకాలు ఉన్న పత్రాలు (ఆధారాలు/ఫైళ్లు) కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండ కార్యాలయంలో ఉన్న ప్రొజెక్టర్‌ను కూడా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కార్యాలయాల మార్పులు, రికార్డుల తరలింపు సమయంలో కొన్ని పత్రాలు దెబ్బతిన్నప్పటికీ, ప్రాజెక్టు ప్రారంభం నుండి ఉన్న కీలక రికార్డులను ఎంతో భద్రంగా కాపాడుకుంటూ వస్తున్నారు. ఈ

తెలంగాణ జర్నలిస్టులకు తీపి కబురు

ఇళ్ల స్థలాల పంపిణీపై మంత్రి పొంగులేటి భరోసా

హైదరాబాద్, అక్టోబర్ 24:



తెలంగాణలో చాలా కాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు తీపి కబురు వచ్చింది. రాష్ట్రంలో ఏళ్ల తరబడి ఇళ్ల స్థలాల కోసం ఆశపడుతున్న మీడియా సమాజానికి ప్రభుత్వం భరోసా ఇచ్చింది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇవాళ సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి, జర్నలిస్టులకు నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 సెప్టెంబర్ 8న రవీంద్రభారతిలో కార్యక్రమం నిర్వహించి సొసైటీకి భూమిని అప్పగించారు. కానీ సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల కారణంగా మళ్లీ సమస్యలు తలెత్తాయి. దీంతో సీఎం రేవంత్ రెడ్డి, సహచర మంత్రులతో చర్చించి శాశ్వత పరిష్కారం కనుగొనాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు.

ట్యాంకర్ల ద్వారా నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి...

గుర్తించింది. దీనివల్ల విలువైన తాగునీరు వృథా కావడంతో పాటు రహదారులపై వాహనదారులకు ఇబ్బందులు, ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ట్యాంకర్లలో నీటి నింపుదల, రవాణా సమయంలో తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను అమలు చేయాలని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగాల జనరల్ మేనేజర్లను ఆదేశించింది.

నవంబర్ 1 నుంచి జరిమానాలు:

ట్యాంకర్ల ద్వారా నీటి వృథాకు పాల్పడినట్లు గుర్తిస్తే 2026 నవంబర్ 1 నుంచి సంబంధిత ట్యాంకర్ యజమానికి రూ.5 వేల జరిమానా విధించనున్నారు. అదే ట్యాంకర్ రెండోసారి నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తిస్తే రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయనున్నారు.

నీటి లీకేజీలు ఉన్న ట్యాంకర్లను, మూతలు లేని లేదా సరిగా మూసివేయని ట్యాంకర్లను ఫిల్లింగ్ స్టేషన్లలో నీటి నింపుదలకు అనుమతించరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నీరు వృథా కాకుండా ట్యాంకర్ యజమానులు, డ్రైవర్లు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



ఫిల్లింగ్ స్టేషన్లలో పర్యవేక్షణ:

జలమండలి పరిధిలోని అన్ని ఫిల్లింగ్ స్టేషన్ల మేనేజర్లు, ఇన్‌చార్జ్‌లు ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ట్యాంకర్లలో నీటిని నింపే ముందు లీకేజీలు, మూతల పరిస్థితిని పరిశీలించాలని, లోపాలు గుర్తించినట్లయితే వాటిని సరిచేసే వరకు నీటి నింపుదలకు అనుమతించరాదని స్పష్టం చేశారు. ఈ ఆదేశాల అమలును సంబంధిత డైరెక్టర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లు పర్యవేక్షించాలని సూచించారు. ట్యాంకర్ అసోసియేషన్లు సైతం తమ సభ్యులకు నిబంధనలపై అవగాహన కల్పించి, నీటి వృథా నివారణకు సహకరించాలని కోరారు.

నీటి సంరక్షణలో అందరి భాగస్వామ్యం అవసరం:

ప్రస్తుత నీటి వనరుల పరిస్థితుల దృష్ట్యా ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని జలమండలి స్పష్టం చేసింది. ప్రజలకు సరఫరా చేసే తాగునీరు రవాణా సమయంలో వృథా కాకుండా చూడటం ట్యాంకర్ యజమానులు, డ్రైవర్ల బాధ్యత అని పేర్కొంది. నీటి పొదుపు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని, జారీ చేసిన మార్గదర్శకాలను సంబంధిత అధికారులు, ట్యాంకర్ నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని జలమండలి సూచించింది





సమావేశంలో మాట్లాడుతున్న పూలపల్లి వెంకటరమణ తోపాటు నిర్వహకులు... సమావేశానికి హాజరైన విద్యార్థులు..

ప్రపంచ శాంతికి ఐక్యరాజ్యసమితి కీలక వేదిక

యుద్ధాల నివారణ నుంచి మానవ హక్కుల పరిరక్షణ వరకు.. ఐరాస ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన

శేరిలింగంపల్లి : అక్టోబర్ 24:

ప్రపంచ దేశాల మధ్య శాంతి, స్నేహసంబంధాలు, సహకారం పెంపొందించడంతో పాటు యుద్ధాలను నివారించి, మానవ హక్కులను పరిరక్షించడంలో ఐక్యరాజ్యసమితి (ఐరాస) కీలక పాత్ర పోషిస్తోందని చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పూలపల్లి వెంకటరమణ అన్నారు. అంతర్జాతీయ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం, పేదరిక నిర్మూలన, విద్యా, వైద్య, సామాజిక అభివృద్ధికి ప్రపంచ దేశాలను సమన్వయం చేయడం ఐక్యరాజ్యసమితి ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మసీదుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఐరాస ప్రాముఖ్యతను వివరించారు. 1945 అక్టోబర్ 24న ఆవిర్భవించిన ఐక్యరాజ్యసమితిలో ప్రస్తుతం 193 సభ్య దేశాలు ఉన్నాయని డాక్టర్ వెంకటరమణ వివరించారు. న్యూయార్క్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన ఈ అంతర్జాతీయ సంస్థ ప్రపంచ శాంతి, భద్రత, ఆర్థికాభివృద్ధి, మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తోందన్నారు. దేశాల మధ్య వివాదాలు యుద్ధాలకు దారితీయకుండా చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవడం ఐరాస ప్రధాన ఆశయమని పేర్కొన్నారు.

ఆరు ప్రధాన విభాగాలతో ప్రపంచ సేవ

ఐక్యరాజ్యసమితి సాధారణ సభ, భద్రతా మండలి, సచివాలయం, ధర్మకర్తృత్వ మండలి, ఆర్థిక సామాజిక మండలి, అంతర్జాతీయ న్యాయస్థానం అనే ఆరు ప్రధాన అంగాల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తోందని వివరించారు. భద్రతా మండలి అంతర్జాతీయ శాంతి, భద్రతకు సంబంధించిన అంశాలపై నిర్ణయాలు తీసుకుంటుందని, అంతర్జాతీయ న్యాయస్థానం దేశాల మధ్య న్యాయ వివాదాలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. యునెస్కో, యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ), అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ), ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ), పర్యావరణ కార్యక్రమం (యూఎన్‌ఈపీ) వంటి సంస్థలు విద్య, బాలల సంక్షేమం, ఆరోగ్యం, వ్యవసాయం, కార్మికుల హక్కులు, పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి రంగాల్లో సేవలందిస్తున్నాయని వివరించారు. ప్రస్తుత ప్రపంచం ఆయుధ పోటీ, ఉగ్రవాదం, పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పులు, మానవ హక్కుల ఉల్లంఘనలు, పేదరికం, నిరుద్యోగం, అంతర్జాతీయ వలసలు వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటోందని డాక్టర్ వెంకటరమణ అన్నారు. అగ్రదేశాల ఆధిపత్య ధోరణి, భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలకు ఉన్న వీటో అధికారం వంటి అంశాలు ఐరాస నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఈ సవాళ్లను అధిగమించేందుకు ప్రపంచ దేశాలు పరస్పర విశ్వాసం, సమానత్వం, సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభిస్తే అంతర్జాతీయ నిర్ణయాల్లో దేశానికి మరింత ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శాంతి, అభివృద్ధి సాధనలో యువత కూడా బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని సూచించారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజని అధ్యక్షత వహించగా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుడు డాక్టర్ అంబేద్కర్, విద్యార్థులు, అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, వాణి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



జూరాల ప్రాజెక్టు ఎస్ఈ కార్యాలయంలో రికార్డుల దగ్ధం.. కలకలం

మొదటి పేజీ తరువాయి...

ఘటనను గుర్తించిన కార్యాలయ ఉన్నతాధికారి సదరు ఉద్యోగికి మెమో జారీ చేశారు. అంతేకాకుండా, అతనిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని జూరాల సాజు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ప్రస్తుతం జూరాల సాజు సెలవులో ఉండటంతో తదుపరి చట్టపరమైన, శాఖాపరమైన చర్యల ప్రక్రియ నిలిచిపోయినట్లు సమాచారం. కేవలం "పాత రికార్డులే కదా" అనే ఉద్దేశంతో ఉదాసీనంగా కాల్చేశారా? లేక ఏదైనా అక్రమాలను కప్పిపుచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా ఈ పనికి ఒడిగట్టారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తిస్థాయి విచారణ జరిపితేనే నిజానిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. గతంలో కూడా ఇదే జిల్లాలోని మానవపాడు తహసీల్దార్ కార్యాలయం, గద్వాల జిల్లా పంచాయతీ కార్యాలయంలో రికార్డులు దగ్ధమైన ఘటనలను ఈ సందర్భంగా స్థానికులు, ఉద్యోగులు గుర్తుచేసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అత్యంత కీలకమైన రికార్డుల భద్రతపై ఈ వరుస ఘటనలు తీవ్ర ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. దీనిపై జూరాల డి.ఎస్ఈ ప్రభాకర్ రెడ్డి వివరణ కోరగా రికార్డులు కాల్చింది వాస్తవేమని, అవి వేస్టేజ్ రికార్డులు అని, అయితే బదిలిపై వెళ్లిన రికార్డు అసిస్టెంట్ డ్యాకుమెంట్ పైల్స్ అప్పజెప్పకుండా ఇలా కాల్చడం నేరమని, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదని, దీనిపై అతనికి మెమోలు జారీ చేసి, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో అసభ్య ప్రవర్తనపై షీ టీమ్స్ ఉక్కుపాదం!

వారం రోజుల్లో 185 డెకాయ్ ఆపరేషన్లు.. 28 మంది పట్టివేత

మానవ అక్రమ రవాణా కేసులో ఇద్దరు బాధితులకు విముక్తి.. ఐదుగురు నిందితుల అరెస్ట్

శేరిలింగంపల్లి : అక్టోబర్ 24:

మహిళల భద్రతకు భంగం కలిగించే అసభ్య ప్రవర్తన, వేధింపులపై సైబరాబాద్ షీ టీమ్స్ నిఘా ముమ్మరం చేశాయి. బహిరంగ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారిని గుర్తించేందుకు వారం రోజుల్లో 185 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి, 28 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మరోవైపు మహిళల నుంచి 11 ఫిర్యాదులు స్వీకరించగా, 39 మందిపై పెట్టీ కేసులు నమోదు చేసినట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మహిళా, శిశు భద్రత విభాగం డీసీపీ సృజన వెల్లడించారు. అక్టోబర్ 17 నుంచి 23 వరకు చేపట్టిన చర్యలను వివరించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ వ్యభిచార నిరోధక చట్టం పిటా కేసులో ఇద్దరు బాధితులను రక్షించి, ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మహిళలు, చిన్నారుల అక్రమ రవాణాను అరికట్టేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య వివాదాల పరిష్కారానికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు, సీడీఈడబ్ల్యూ కేంద్రాల ద్వారా 17 కుటుంబాలను తిరిగి ఒక్కటి చేసేందుకు అధికారులు ప్రయత్నించారు. కుటుంబ సమస్యలను సామరస్యంగా పరిష్కరించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు.



సైబరాబాద్ మహిళ శిశు భద్రత విభాగం డీసీపీ సృజనా..

1,225 మందికి అవగాహన కార్యక్రమాలు

మహిళలు, చిన్నారుల రక్షణతో పాటు సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు సైబరాబాద్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో మొత్తం 1,225 మంది పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, సైబర్ బుల్లీయింగ్, సైబర్ మోసాలు, బాల్యవివాహాలు, వెంటపడుతూ వేధించడం (స్టాకింగ్), పిల్లలను బలవంతంగా యాచనలోకి దింపడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

అత్యవసర సమయాల్లో హెల్ప్‌లైన్లను ఆశ్రయించండి

మహిళలు, చిన్నారులు వేధింపులకు గురైనప్పుడు లేదా ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే సంబంధిత హెల్ప్‌లైన్లను సంప్రదించాలని అధికారులు సూచించారు. మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ అత్యవసర సహాయం 100, సైబర్ ఆర్థిక మోసాల ఫిర్యాదులకు 1930, ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, కౌన్సెలింగ్ కేంద్రాల ద్వారా చర్యలు కొనసాగిస్తున్నట్లు సైబరాబాద్ మహిళా, శిశు భద్రత విభాగం డీసీపీ తెలిపారు.



బడంగ్‌పేట్ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి

రంగారెడ్డి, అక్టోబర్ 23:

బడంగ్‌పేట్‌లోని రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పాఠకులకు అందిస్తున్న సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, గ్రంథాలయ నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి వచ్చిన పాఠకులతో ఆమె మాట్లాడి, ముఖ్యంగా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల సన్నద్ధత గురించి ఆరా తీశారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు సరైన ప్రణాళికతో చదవడం, సమయపాలన పాటించడం, నిర్దిష్ట లక్ష్యంతో నిరంతరం సాధన చేయడం, అందుబాటులో ఉన్న పుస్తకాలు మరియు అధ్యయన సామగ్రిని సమర్థవంతంగా వినియోగించుకోవడం వంటి అంశాలపై పాఠకులకు సూచనలు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు క్రమశిక్షణతో చదువుతూ, ప్రస్తుత అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని, పునశ్చరణకు తగిన సమయం కేటాయించాలని సూచించారు. గ్రంథాలయాలు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విజ్ఞానాన్ని అందించడంతో పాటు, వారి భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడే ముఖ్యమైన వేదికలని పేర్కొన్నారు. అనంతరం గ్రంథాలయంలో పాఠకులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పుస్తకాల లభ్యత, అధ్యయన వాతావరణం తదితర అంశాలను పరిశీలించారు. పాఠకులకు మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.జి.వి. రాణి, గ్రంథాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పీఎం రాహత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం

రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 2:

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సహాయం అందించి, ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీఎం రాహత్ పథకం అమలుపై సమీక్షించారు. ఈ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదయ్యే రోడ్డు ప్రమాద కేసులను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, బాధితుల వివరాల ధ్రువీకరణలో పోలీసులు తక్షణమే స్పందించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఆసుపత్రుల చికిత్స ఖర్చులకు సంబంధించిన క్లెయిమ్‌లను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించి, నిబంధనల ప్రకారం ఆమోదించాలని, ఆసుపత్రులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాధితులకు చికిత్సలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. నెక్ట్‌జెన్ ఎం-పరివాహన్ మొబైల్ యాప్ ద్వారా రోడ్డు ప్రమాదాల సమాచారాన్ని నమోదు చేయడం, పథకం కింద క్లెయిమ్‌ల స్థితిని తెలుసుకోవడంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పథకం అమలులో ఎదురయ్యే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ ద్వారా అవసరమైన సాంకేతిక సహకారం పొందాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, రహదారి భద్రతా లోపాలను సరిచేసి, అవసరమైన నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు. రవాణా, పోలీస్, వైద్య ఆరోగ్య, ఆర్ అండ్ బి, ఎన్‌హెచ్ఏఐ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రమాద బాధితులకు సత్వర వైద్య సేవలు అందించేందుకు అంబులెన్స్‌లు, ఆసుపత్రులు, ట్రామా సెంటర్ల సేవలను సమీక్షించాలని, సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇచ్చి అవసరమైన ప్రక్రియలను వచ్చే వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా నమోదైన కేసులు, ఆమోదించిన క్లెయిమ్‌లు, పెండింగ్ కేసులపై సమగ్ర నివేదిక సమర్పించాలని, అన్ని శాఖలు నెలవారీ పురోగతి నివేదికలు అందజేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఆర్ అండ్ బి, రవాణా శాఖలఅధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం

ప్రజలకు, రైతులకు అందించాలని వారు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని వినియోగంలోకి తీసుకొస్తే మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకి మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని ఎత్తిపోసేందుకు ముందుకు రావడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసి ప్రజలకు, రైతులకు ప్రయోజనం చేకూర్చాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని వారు తెలిపారు. ప్రజల తాగునీటి అవసరాలు, రైతుల సాగునీటి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునే చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం డిమాండ్ చేసింది. ఈ పర్యటనలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి , ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద , కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి , మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు , మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణ రెడ్డి , స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరుకాని 54 మంది

లైసెన్స్ సర్వేయర్ల సేవలు రద్దు

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి

రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 24:



రంగారెడ్డి జిల్లా పరిధిలో విధులకు హాజరుకాకుండా, షోకాజ్ నోటీసులకు స్పందించని 54 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను తక్షణమే రద్దు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 281 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించగా, వారిలో 102 మంది విధులకు హాజరుకాకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నోటీసులకు స్పందించి 48 మంది తిరిగి విధుల్లో చేరగా, ఎలాంటి స్పందన ఇవ్వని మిగిలిన 54 మంది సర్వేయర్ల సేవలను రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే పనుల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. రీ సర్వే పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సర్వేయర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరు కావడం, అధికారుల ఆదేశాలను పాటించకపోవడం వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. విధులకు హాజరుకాని సర్వేయర్ల స్థానంలో కొత్త లైసెన్స్ సర్వేయర్లను నియమించి, రీ సర్వే పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిగిలిన లైసెన్స్ సర్వేయర్లందరూ ఈ విషయాన్ని గమనించి, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు కొత్తగూడెం క్రీడాకారుల ఎంపిక

- జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటిన కె.బి.సి విద్యార్థులు.. సంగారెడ్డిలో రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం

కొత్తగూడెం అర్బన్ , అక్టోబర్ 24(భద్రాద్రిన్యూస్): ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఎస్.జి.ఎఫ్ అండర్-14, అండర్-17 బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల్లో కొత్తగూడెంలోని కె.బి.సి విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కొత్తగూడెంలోని హనుమాన్ బస్తీ బ్యాడ్మింటన్ క్లబ్‌లో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు ప్రతిభను చాటుకున్నారు. బాలికల విభాగంలో అండర్-14 కేటగిరీలో గీతాంజలి హైస్కూల్‌కు చెందిన ఎన్. లెహనా పల్లవి (6వ తరగతి), శ్రీ విద్య స్కూల్‌కు చెందిన శాన్వి (7వ తరగతి), నవభారత్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన వీక్ష (6వ తరగతి) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో



అండర్-17 కేటగిరీలో నవభారత్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఎన్. కార్తికేయ (9వ తరగతి), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న జోయెల్ జోసెఫ్ ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో త్రివేణి స్కూల్‌కు చెందిన



ఎం. కేతన్ (8వ తరగతి), శ్రీ విద్య స్కూల్‌కు చెందిన కె. కార్తికేయ (9వ తరగతి) రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. నవంబర్ మొదటి వారంలో సంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎస్.జి.ఎఫ్.బ్యాడ్మింటన్ పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను జిల్లా యువజన క్రీడల అధికారి పరంధరామ రెడ్డి, ఎస్.జి.ఎఫ్.ఐ కార్యదర్శి శ్రీ భావ్ సింగ్, వేణుగోపాల్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ఉదయ్, హరీష్, విక్రమ్, కోచ్ గంగాధర్ అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మరిన్ని విజయాలు, పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆలోచింపజేసిన నీలవేణి నాటకం

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 24 (భద్రాద్రిన్యూస్): ఖమ్మం భక్త రాందాస్ కళాక్షేత్రంలో 11 నెల వెన్నెల ప్రదర్శనలో భాగంగా శనివారం రాత్రి ప్రదర్శించిన నీలవేణి నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. ఈ నాటకం జాతీయ స్థాయి గుర్తింపు పొందిందని అనేక సామాజిక సమస్యలను స్పృశిస్తూ ప్రాచీన సంస్క త, జానపద, శాస్త్రీయ, ఆధునిక కళారీతుల మేళవింపుతో ప్రేక్షకులను ఆద్యంతం మంత్రముగ్ధుల్ని చేసింది. అత్యద్భుతమైన దర్శకత్వ ప్రతిభతో ప్రేక్షకులను కట్టుపడి వేసింది. ఒక పాడుబడ్డ కనకదుర్గ అమ్మవారి దేవాలయం దగ్గర ఐదుగురు భిక్షకులు వారి మధ్య సంభాషణలు మసక చీకటిలో నీలి దీపాల వెలుతురులో నాటకం ప్రారంభం అవుతూ ఒక సీన్లో దీదీప్యమానంగా కాంతులీనుతూ కనక దుర్గమ్మ వారు ప్రత్యక్షమై సామాజిక న్యాయం అనే కోణంలో ప్రతి స్పందించడం నాటక రంగ చరిత్రలో గొప్ప ఆధ్యాయంగా నిలుస్తుంది.దర్శకుడి అత్యద్భుత ప్రతిభతో ప్రేక్షకులను సాధారణ స్థాయి నుండి ఉత్సుకతను తారాస్థాయికి తీసుకెళ్లింది .ఈ నాటక రచయిత దర్శకుడు శ్రీనివాస్ దెంచనాల రంగస్థల, సినీ రచయిత దర్శకులు నటులు గొల్లపూడి మారుతీ రావు కళ్ళు నాటకాన్ని ఇందులో ఉపయోగించుకుంటూ అద్భుతమైన ప్రయోగంతో తిరుగుబాటు నేపథ్యంలో అద్భుతమైన డైలాగులతో ప్రేక్షకుల హృదయాలను రంజింప చేసేయ్ దృశ్యాలతో ముందుకు సాగింది. జానపద రిపోర్టర్ హైదరాబాద్ కళాకారులు తమ పాత్రలకు జీవం పోశారు. ప్రదర్శనల అనంతరం ఆత్మీయ అతిథులు, ప్రదర్శనలు ప్రతిస్పందనగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె రంజాన్, ప్రముఖ కవి, విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బెల్లంకొండ ప్రసేన్, సీనియర్ రచయిత విమర్శకులు డాక్టర్ అంబడిపూడి సురేంద్ర రాజు, ప్రముఖ కవి సాహితీవేత్త మువ్వ శ్రీనివాసరావు, ప్రముఖ రచయిత కవయిత్రి జ్వలిత, ప్రముఖ కవి, విమర్శకులు సీతారాం, తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్ పారుపల్లి ఝాన్సీ కుమారి, ప్రముఖ మానసిక వైద్యులు సంఘ సేవకులు యర్రా శ్రీధర్ రాజు తదితరులు నాటకాన్ని సమీక్షించారు. అమరజీవి యనమదల జోషి స్మృత్యర్థం యనమదల లీల, కుటుంబ సభ్యుల సహకారంతో ఈ ప్రదర్శన నిర్వహించారు.

ఉదయ్ అస్తమించినా.. నేత్రదానంతో వెలుగులు!

- గుండెపోటుతో 28 ఏళ్ల రైల్వే ఉద్యోగి మృతి..

- మరణంలోనూ మరో ఇద్దరికి చూపునిచ్చే మహోన్నత నిర్ణయం

కొత్తగూడెం, అక్టోబర్ 24 (భద్రాద్రిన్యూస్): 'ఉదయ్' అనే తన పేరును సార్థకం చేసుకుంటూ.. తాను అస్తమించినా మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అరవపల్లి ఉదయ్ కుమార్ (28) నేత్రదానం చేశారు. గుండెపోటుతో అకాల మరణం చెందిన ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. తమ కుటుంబంలో తీరని విషాదం నెలకొన్నప్పటికీ, ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాలనే గొప్ప నిర్ణయం తీసుకోవడం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ రైటర్ బస్తీ, గొల్లగూడెం రైల్వే కాలనీకి చెందిన ఉదయ్ కుమార్ బీడీసీఆర్ రైల్వేలో అసిస్టెంట్ టీఆర్‌డీ గ్రూప్-డి ఉద్యోగిగా పనిచేస్తున్నారు. శనివారం విధులు నిర్వర్తిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే తోటి సిబ్బంది ఆయనను రైల్వే ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. యువకుడి అకాల మరణంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అయితే, ఆ దుఃఖ సమయంలోనూ ఉదయ్ నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. గర్వాల్ కంటి ఆసుపత్రికి నేత్రాలను దానం చేసి, చూపు కోసం ఎదురుచూస్తున్న వారికి వెలుగులు అందించే అవకాశం కల్పించారు. ఉదయ్ మరణం ఆయన కుటుంబానికి తీరని లోటుగా మిగిలినప్పటికీ, నేత్రదానం ద్వారా మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపే స్ఫూర్తిదాయక



సందేశాన్ని అందించారు. యువతలో అవయవదానం, నేత్రదానంపై అవగాహన పెరగాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నారు. చిన్న వయసులోనే కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.
విషయం తెలుసుకున్న సహోద్యోగి రైల్వే రమేష్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ కు చేరుకుని ఉదయ్ పార్థివ దేహాన్ని చూసి



ఉదయ్ పార్థివ దేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు రైల్వే రమేష్

కన్నీరుమున్నీరయ్యారు. ఆయన్ని ఓదార్చడం అక్కడున్న వారికి కష్టమయింది.

ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేషన్ పైన అవగాహన పొంది తిరిగి రండి

జిల్లా విద్యాశాఖ అధికారి డి వాసంతి .



ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 24(భద్రాద్రిన్యూస్): కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలో భాగంగా రీజనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మైసూర్ కు మరియు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు విజిట్ కి వెళ్తున్న పీఎం శ్రీ పాఠశాలల ప్రిన్సిపల్ మరియు ప్రధానోపాధ్యాయుల పర్యటనకు జిల్లా విద్యాశాఖ అధికారి డి వాసంతి.ఐ జెండా ఊపి ప్రారంభించారు ఖమ్మం జిల్లా లోని 28 పాఠశాలలో పనిచేస్తున్న పీఎం శ్రీ పాఠశాలల ప్రిన్సిపల్ మరియు ప్రధానోపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ టూర్ లో భాగంగా ఈరోజు 28 మంది ప్రధానోపాధ్యాయులు, జిల్లా ఎకడమిక్ మానిటరింగ్ అధికారి ప్రజల ప్రభాకర్ రెడ్డి ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణల నేతృత్వంలో ఈరోజు బయలుదేరి రీజనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మైసూర్ కు మరియు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటనలో పాఠశాలలో అవసరమైన నాయకత్వ లక్షణాల పైన అంశాల పైన మీరు అవగాహన పొందనున్నారు.

శ్రీ రాగా స్కూల్‌లో ఘనంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవం

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 24(భద్రాద్రిన్యూస్):-

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం పట్టణంలోని మెదరబస్తీలో గల శ్రీ రాగా ప్లే ఉ హై స్కూల్‌లో ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అసెంబ్లీలో కరస్పాండెంట్.మల్లారపు.వరప్రసాద్,డైరెక్టర్ కవిత మరియు ఉపాధ్యాయులు ఐక్యరాజ్యసమితి ఆవిర్భావం, లక్ష్యాలు, ప్రపంచ శాంతి స్థాపనలో దాని పాత్ర, అంతర్జాతీయ సహకారం, మానవ హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రపంచ దేశాల మధ్య స్నేహభావం, ఐకమత్యం, పరస్పర గౌరవం, శాంతి, సహకారం ఎంతో అవసరమని వివరించారు. వివిధ దేశాల మధ్య నెలకొనే సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడంలో ఐక్యరాజ్యసమితి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రపంచ పౌరులుగా ఎదుగుతూ, మానవతా విలువలు, సహనం, సమానత్వం,



సోదరభావం వంటి సద్గుణాలను అలవర్చుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అంతర్జాతీయ అవగాహన, ప్రపంచ శాంతి పట్ల బాధ్యత, విలువలతో కూడిన విద్య ప్రాముఖ్యతను పెంపొందించేందుకు కృషి చేశారు.పిల్లలకు



ఐక్యరాజ్యసమితి గురించి క్విజ్ , ఉపన్యాస మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు,మహా లక్ష్మీ,స్వాతి,భారాణి ,రమ్య ,నాగమణి,చరితశ్రీ,వెంకట లక్ష్మి,హసీనా, అఖిల,రామకృష్ణ , ఆఫ్రీన్ ,రజినీ ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైరా మండలం పలు గ్రామాల్లో ఓటు నమోదు కేంద్రాలు ఏర్పాటు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లకు ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి

వైరా, అక్టోబర్ 24,(భద్రాద్రి న్యూస్) :



వైరా నియోజకవర్గ మండలంలో శనివారం అన్ని గ్రామ పంచాయతీల్లో ఎమ్మెల్సీ వాట్ల ప్రచారంలో భాగంగా ఓటు నమోదు కేంద్రాలను వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. మండలంలోని ఓటు నమోదు కేంద్రాల గ్రామాలు సిరిపురం, గరికపాడు, గన్నవరం, పాలడుగు, గొల్లపూడి, రెబ్బవరం, తాటిపూడి ఈ గ్రామాల్లో పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటు హక్కు కలిగి ఉన్న ఏ సబ్జెక్టులో అయినా డిగ్రీ పాసై యున్న ప్రతి ఒక్క యువతీ,యువకులు తప్పనిసరిగా తమ ఓటు నమోదు కేంద్రంలోకి వెళ్లి ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ని గ్రాడ్యుయేట్స్ అందరూ కూడా ఎమ్మెల్సీ ఓట్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కును అందరు వినియోగించుకోవాలని, తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బి ఎల్ ఏ లు, గ్రాడ్యుయేట్స్, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు

ఎమ్మెల్సీ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించండి

- మేకల మల్లిబాబు యాదవ్,గుజ్జర్లపూడి రాంబాబు

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 24 (భద్రాద్రిన్యూస్):-

వరంగల్ -నల్గొండ- ఖమ్మం నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, పిఎసిఎస్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం ధనియాకుల హనుమంతరావు, తోటకూరి శివయ్య, గబ్రు నాయక్ పిలుపునిచ్చారు.

కామేపల్లి మండలం కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో శనివారం నాడు కామేపల్లి మండలంస్థాయిలో పట్టభద్రుల సమావేశం జరిగింది. భారీగా పాల్గొన్న పట్టభద్రులసమావేశంలో పాల్గొన్న మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వలన తెలంగాణ అభివృద్ధి కుంటుపడినప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి రేవంత్ రెడ్డి హయాంలో మహిళలకు ఫ్రీ బస్సు పథకం, 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ పథకం, రైతుబంధు,రైతు బీమా లాంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ, ఖమ్మం జిల్లాలో సాగునీరు త్రాగునీటి కోసం సీతారాం ప్రాజెక్టు ద్వారా కాలువలు చెరువులు నింపే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. అభ్యర్థి విషయంలో పార్టీ తగు నిర్ణయం తీసుకున్నదని, రాంరెడ్డి కుటుంబం అంటే ఒక బ్రాండ్ అని, రాష్ట్ర వ్యాప్తంగా ఆ కుటుంబానికి మంచి పేరు ఉన్నదని, ప్రజలలో వారికి ఉన్న మంచితనానికి రాజకీయ అనుభవానికి పార్టీ గుర్తించిందని, అంతేకాకుండా ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి వారి నాన్నగారు మాజీ మంత్రివర్యులు కీ. శే రాంరెడ్డి దామోదర్ రెడ్డి, పెదనాన్నగారు కీ. శే
రాం రెడ్డి వెంకట రెడ్డి ఆశయాల మేరకు ఉన్నతమైన భావాలతో ప్రజలకు సేవ చేస్తున్నారని, ఎంతో ఉన్నతమైన చదువులు చదివి కూడా ప్రజాసేవకు



అంకితమయ్యారని, అలాంటి వ్యక్తిని గెలిపించుకోవడం వలన ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నదని, కావున 2023 నవంబర్ ఒకటికి ముందు ఉత్తీర్ణులైన పట్టభద్రులు 18 ఫారం ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, మండలంలో ప్రతి గ్రామంలో గ్రాడ్యుయేట్ లను నమోదు చేసే కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని, పార్టీ కార్యకర్తలు నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి పట్టభద్రుల ఓట్లు నమోదు చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేపల్లి సర్పంచ్ ధరావత్ అనురాధ, పింజరమడుగు సర్పంచ్ భాష, బేకుల తండా సర్పంచ్ రెడ్డి, సాతాను గూడెం సర్పంచ్ రెడ్యా, మాజీ ఎంపీపీ మాలోత్ సరిరామ్ నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు ఉప్పుగండ్ల వీరభద్రం ఆలోత్ శివ, నత్తి వీరబాబు, గుగులోతు రవి, కోల వెంకటేశ్వర్లు చల్ల మల్లయ్య, కాటయ్య పుచ్చకాయల అప్పారావు మల్లెంపాటి అప్పారావు, బద్రు గాడేపల్లి రవి శ్రీరాములు, పాటిబండ్ల ప్రసాద్ శీలం పుల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, పండగ కోటి, తదితరులు పాల్గొన్నారు

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు హార్వెస్ట్ విద్యార్థిని హన్సిని

- రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ.. సిమ్లాలో జరిగే జాతీయ పోటీలకు ఎంపిక

ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి బాలికల వాలీబాల్ పోటీల్లో ఖమ్మంలోని హార్వెస్ట్ విద్యాసంస్థకు చెందిన విద్యార్థిని జి. హన్సిని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. మహబూబ్‌నగర్ జిల్లా రంగారెడ్డిగూడలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఖమ్మం జిల్లా జట్టు తరఫున హన్సిని అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్. పార్వతీ రెడ్డి మాట్లాడుతూ, తమ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి. హన్సిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. నవంబర్ మూడో వారంలో హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో జరగనున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో హన్సిని ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్రానికి, జిల్లాకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని అభిలషించారు. క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయని, ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని వారు తెలిపారు.



విద్యార్థుల క్రీడా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు తమ విద్యాసంస్థల్లో ప్రతిరోజూ క్రమం తప్పకుండా క్రీడా తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హన్సినికి ప్రత్యేక శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా వారు అభినందించారు. జాతీయస్థాయిలోనూ హన్సిని విజయకేతనం ఎగురవేయాలని ఆకాంక్షించారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
ఆదివారం
25, అక్టోబర్, 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

బాస్కెట్‌బాల్‌లో సత్తాచాటిన స్టెమ్‌స్పార్క్ విద్యార్థిని ప్రీతిక శ్రీ

- సిటీ లెవెల్ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన..

- మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌తో సత్కారం



ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్): ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ విద్యార్థిని వి. ప్రీతిక శ్రీ బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటుకుంది. డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్, ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించిన సిటీ లెవెల్ స్కూల్స్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ప్రీతిక శ్రీ తన అద్భుత ఆటతీరుతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. వ్యక్తిగతంగా కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్రేక్షకులతో పాటు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధుల ప్రశంసలు అందుకుంది. ఆమె ప్రతిభను గుర్తించిన అసోసియేషన్ నిర్వాహకులు మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో డైరెక్టర్లు కె. శ్రీధర్‌రావు, శ్రీమతి కృష్ణవేణి మాట్లాడుతూ, బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన ప్రీతిక శ్రీని అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు తమలోని సహజ నైపుణ్యాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులను విద్యతోపాటు క్రీడలు, విజ్ఞాన శాస్త్రం తదితర రంగాల్లోనూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు తమ పాఠశాలలో ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన, శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే తమ విద్యార్థులు ఇన్‌స్పైర్ మానక్, సైన్స్ ఎగ్జిబిషన్లలో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తున్నారని, కరాటే సహా వివిధ పోటీల్లోనూ విజయాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె. సురేష్, ఖమ్మం బాస్కెట్‌బాల్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ రమణ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని ప్రీతిక శ్రీని అభినందించారు.

మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

- ఆశ వర్కర్లకు అంగనవాడి ఆయలు

- కనీస వేతనం 26 వేల రూపాయలను ఇవ్వాలి

- సిఐటియు మండల కన్వీనర్ బాదవత్ శ్రీను ప్రభుత్వానికి డిమాండ్



కామేపల్లి,అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్): మధ్యాహ్న భోజన వర్కర్ల అంగన్వాడి ఆయలు ఆశ వర్కర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరుతూ శనివారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో కామేపల్లి మెడికల్ ఆఫీసర్ మండల విద్యాశాఖ అధికారి కి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వర్కర్ల పట్ల సవతి తల్లి ప్రేమ తో చిన్నచూపు చూడడం తగదని అన్నారు.తమ సమస్యలు పరిష్కరించుకుంటే అవి పరిష్కారం అయ్యేవరకు దశలవారీగా ఆందోళన చేస్తూ.ఉద్యమిస్తామని అందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.ఈనెల 26 తేదీన హైదరాబాదు ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా ను జయప్రదం చేయాలని వివిధ శాఖలలో పనిచేస్తున్న వర్కర్లను కోరారు.ఈ కార్యక్రమం లో మధ్యాహ్న భోజన వర్కర్స్ అంగన్వాడి ఆయలు ఆశ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి లింగం జయమ్మ, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

వృక్షో రక్షతి రక్షితః

- మానవాళిని కాలుష్యము నుండి రక్షించే ఔషధాలు పచ్చని చెట్లు- మాదినేని సునీత



వైరా, అక్టోబర్ 24,(భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ శనివారం 12వ వార్డులో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని కౌన్సిలర్ మాదినేని సునీత ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో కలిసి వార్డులోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సునీత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు పచ్చని చెట్ల పెంపకం ఎంతో అవసరమని భావితరాలకు, భవిష్యత్ కోసం మొక్కల పెంపకం మానవాళికి ఎంతో అవసరమని, పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని, పచ్చని చెట్లు, ప్రగతికి మెట్లు అనే నినాదంతో, ప్రతి ఒక్కరు ముందుకు పోవాలని, కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఈ విధంగా మొక్కలు నాటడం వలన కాలుష్య నరికట్టి, కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించవచ్చును అని, చెట్లు స్వచ్ఛమైన గాలిని అందించుటతోపాటు పర్యావరణ సమతుల్యను కాపాడుటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా కనీసం ఒక్క మొక్క నాటి, అది పెరిగి పెద్దయ్యే వరకు బాధ్యతగా సంరక్షించాలని, పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చును అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ అధికారులు వెంకట్రావు, శ్రీను, వలువురు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

స్పైసీ హోటల్‌పై విద్యుత్ శాఖ మౌనం ఎందుకు?

- పేదోడికి ఒక న్యాయం.. పెద్దోడికి మరో న్యాయమా?

- ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అనుమతులపై స్పష్టత ఏది?

- ఫిర్యాదులపై చర్యలు ఎక్కడ?

పాల్వంచ, అక్టోబర్ 24,(భద్రాద్రి న్యూస్): నిబంధనలు ఉల్లంఘించిన సామాన్యులపై తక్షణమే కొరడా ఝళిపించే విద్యుత్ శాఖ అధికారులు, స్పైసీ హోటల్‌పై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఒక సామాన్యుడు తన ఇంట్లో లేదా ఫంక్షన్‌లో విద్యుత్ వినియోగానికి సంబంధించి నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించే అధికారులు, ఓ హోటల్‌పై ఆరోపణలు వచ్చినప్పుడు మాత్రం ఎందుకు స్పందించడం లేదని ప్రజలు నిలదీస్తున్నారు. ఈనెల అక్టోబర్ 14న బీఆర్ఎస్, టీఆర్పీ సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీలో స్పైసీ హోటల్‌కు సంబంధించిన విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, వాటికి సంబంధించి అవసరమైన అనుమతులపై నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. అనుమతులు ఉన్నాయా? లేవా? నిబంధనల ప్రకారమే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారా? సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలపై విద్యుత్ శాఖ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ డిమాండ్లపై ఇప్పటివరకు స్పష్టమైన సమాచారం ప్రజలకు అందకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందాయా? అందితే వాటిపై ఎలాంటి విచారణ చేపట్టారు? నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారా? గుర్తిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. ఆరోపణలు నిజమో కాదో తేల్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే అయినప్పటికీ, ఈ వ్యవహారంపై స్పష్టత లేకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది.

సామాన్యుడికే చట్టాలు.. పెద్దవారికి వర్తించవా?

ఒక సామాన్యుడు ఫంక్షన్ కోసం తాత్కాలికంగా విద్యుత్ వైరు వినియోగించినా, నిబంధనల ఉల్లంఘన జరిగితే భారీ జరిమానాలు విధించే విద్యుత్ శాఖ అధికారులు, స్పైసీ హోటల్ వ్యవహారంలో మాత్రం ఇప్పటివరకు చర్యలు కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామాన్యుల విషయంలో వేగంగా స్పందించే యంత్రాంగం, ప్రభావవంతమైన వ్యక్తులు లేదా వ్యాపార సంస్థల విషయంలోనూ అదే నిష్పక్షపాత ధోరణిని ప్రదర్శించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

చట్టం ముందు అందరూ సమానమేనన్న సూత్రం విద్యుత్ శాఖకు వర్తించదా? నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చిన్నవారైనా, పెద్దవారైనా ఒకే విధమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని పట్టణ ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఎవరిపైనా ముందస్తు నిర్ణయానికి రాకుండా, ఆరోపణలపై పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరుతున్నారు.

ఇకనైనా అధికారులు మేల్కొంటారా?

స్పైసీ హోటల్‌కు సంబంధించిన విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, అనుమతులు, విద్యుత్ భద్రతా ప్రమాణాలపై సమగ్ర తనిఖీ నిర్వహించి, నిబంధనల ప్రకారం అన్ని అంశాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఉల్లంఘనలు లేకపోతే ఆ విషయాన్ని కూడా స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా మౌనం వహించడం వల్ల విద్యుత్ శాఖపై అనవసర అనుమానాలు పెరిగే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, సామాన్యులకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయం అనే భావనకు తావులేకుండా వ్యవహరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ప్రజల ప్రశ్న ఒక్కటే.. స్పైసీ హోటల్ వ్యవహారంపై విద్యుత్ శాఖ అధికారుల విచారణ ఎక్కడ ఆగింది? అనుమతులపై స్పష్టత ఎప్పుడు ఇస్తారు? నిబంధనల ఉల్లంఘనలు ఉంటే చర్యలు ఎప్పుడు తీసుకుంటారు?

విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ప్రజల నిలదీత!



ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించండి

- జిల్లా డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్,

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు



కామేపల్లి,అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్):-

వరంగల్ -నల్గొండ- ఖమ్మం నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, పిఎసిఎస్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం ధనియాకుల హనుమంతరావు, తోటకూరి శివయ్య, గబ్రు నాయక్ పిలుపునిచ్చారు.

మండలంలోని కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో శనివారం కామేపల్లి మండల స్థాయి పట్టభద్రుల సమావేశం జరిగింది. భారీగా మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల పట్టభద్రుల సమావేశంలో పాల్గొన్న మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వలన తెలంగాణ అభివృద్ధి కుంటుపడినప్పటికీ,ఇచ్చిన మాటకు కట్టుబడి రేవంత్ రెడ్డి హయాంలో మహిళలకు ఫ్రీ బస్సు పథకం,200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ పథకం,రైతుబంధు,రైతు బీమా లాంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ జిల్లాలో సాగునీరు త్రాగునీటి కోసం సీతారామ ప్రాజెక్టు ద్వారా కాలువలు చెరువులు నింపే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. అభ్యర్థి విషయంలో పార్టీ తగు నిర్ణయం తీసుకున్నదని,రాంరెడ్డి కుటుంబం అంటే ఒక చెరగని ముద్ర అని,రాష్ట్ర వ్యాప్తంగా ఆ కుటుంబానికి మంచి పేరు ఉన్నదని ప్రజలలో వారికి ఉన్న మంచితనానికి రాజకీయ అనుభవాన్ని పార్టీ గుర్తించిందని. పట్టభద్రులకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని నియమించి టికెట్ ఖరారు చేసిందని. వారి తండ్రి మాజీ మంత్రి కీ.శే. రాంరెడ్డి దామోదర్ రెడ్డి, పెదనాన్న కీ.శే రాంరెడ్డి వెంకట రెడ్డి ఆశయాల మేరకు ఉన్నతమైన భావాలతో ప్రజలకు సేవ చేస్తున్నారని, ఎంతో ఉన్నతమైన చదువులు చదివి కూడా ప్రజాసేవకు అంకితమయ్యారని అన్నారు.అలాంటి వ్యక్తిని గెలిపించుకోవడం వలన ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు.2023 నవంబర్ ఒకటికి ముందు ఉత్తీర్ణులైన పట్టభద్రులు 18 ఫారం ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని,మండలంలో ప్రతి గ్రామంలో గ్రాడ్యుయేట్ లను నమోదు చేసే కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని,పార్టీ కార్యకర్తలు నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి పట్టభద్రుల ఓట్లు నమోదు చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొమ్మినేపల్లి, పింజరమడుగు, టేకుల తండా,సాతాని గూడెం సర్పంచులు ధరావత్ అనురాధ, భాషా,రెడ్డి, రెడ్యా, మాజీ ఎంపీపీ మాలోత్ సరిరామ్ నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు. బొడ్డు లక్ష్మీనారాయణ. ఉప్పుగండ్ల వీరభద్రం ఆలోత్ శివ,సత్తి వీరబాబు, గుగులోతు రవి,కోలా వెంకటేశ్వర్లు చల్లా మల్లయ్య,కాటయ్య పుచ్చకాయల అప్పారావు మల్లెంపాటి అప్పారావు, బద్రు,గాడేపల్లి రవి, శ్రీరాములు,పాటిబండ్ల ప్రసాద్ శీలం పుల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, పండగ కోటి,తదితరులు పాల్గొన్నారు.





పుణ్యపురంలో ఉచిత మెగా వైద్య శిబిరం..

- ప్రజలకు వైద్య సేవలు అందించిన సర్పంచ్ మరియమ్మ

- గ్రేస్ జనరల్ హాస్పిటల్ సహకారంతో నిర్వహణ..

- ఉచితంగా బీపీ, షుగర్, కంటి పరీక్షలు..

- అవసరమైన వారికి మందుల పంపిణీ



వైరా, అక్టోబర్ 24, (భద్రాద్రి న్యూస్) :

ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురం గ్రామంలో సర్పంచ్ యంగల మరియమ్మ ఆధ్వర్యంలో గ్రేస్ జనరల్ హాస్పిటల్, తనికెళ్ల వారి సహకారంతో శనివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఈ శిబిరంలో గ్రేస్ జనరల్ హాస్పిటల్ నుంచి వచ్చిన వైద్య బృందం గ్రామస్తులకు ఉచితంగా రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) పరీక్షలు నిర్వహించింది. అదేవిధంగా కంటి పరీక్షలు చేసి, వైద్యుల సూచనల మేరకు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలోనే వైద్య పరీక్షలు అందుబాటులోకి రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ సర్పంచ్ యంగల మరియమ్మ చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామస్తుల ప్రశంసలు అందుకుంది. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందించడం ఎంతో ఉపయోగకరమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రేస్ జనరల్ హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్య బృందానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.





కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ లో 15 కుటుంబాలు చేరిక

కామేపల్లి,అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్): మండలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీ లో చేరారు. నియోజకవర్గ పరిధిలోని టేకులపల్లి మండలం దాస్ తండా హరిప్రియ నాయక్ స్వగృహంలో శనివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కిషన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండలంలో కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ 15 కుటుంబాలు రాజీనామా చేసి ఆ పార్టీని వదిలి. బీఆర్ఎస్‌లో ఆ మండల మాజీ అధ్యక్షుడు అంతోటి అచ్చయ్య ఆధ్వర్యంలో చేరారు.వారికి పార్టీ నాయకులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న కాలం బిఆర్ఎస్ పార్టీదే అని ప్రజలంతా కెసిఆర్ బిఆర్ఎస్ పాలన వైపు చూస్తున్నారని అన్నారు. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు.కామేపల్లి మండలం కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన వెన్ను హరికృష్ణ, గుబెనపలి జంగం, బానోతు అఖిల్, మాలోత్ మంజి, కెలోత్ రాజేష్, పొందేం వీరయ్య, అరేం బసవయ్య, అరేం రాంబాబు తదితరులు బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ చైర్మన్, లక్కినేని సురేందర్రావు, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు, భూక్యా దళ్ సింగ్ నాయక్, రాంపురం సర్పంచ్ బర్మావత్ శివకృష్ణ, బానోతు నరేష్ , మహిళా నాయకురాలు ఆమేద రేణుక, భానోత్ రామా నాయక్, భూక్యా లాలు, మాలోత్ పుల్ సింగ్, నాగభూషణం ,కామేపల్లి మండల నాయకులు అంతోటి అచ్చయ్య, మూడ్ కృష్ణ ప్రసాద్, మల్లంపాటి శ్రీనివాస్, సామా మోహన్ రెడ్డి, కాటాల రాంబాబు, ఉద్యమకారులు దేవిలాల్, ఎస్.కే. నాగుల్ మీరా, గుంపెనపల్లి అనంత రాములు, ఈసం రామ్మూర్తి తదితరులు హాజరయ్యారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు పార్టీ శ్రేణులతో ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.



హెల్త్ వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలి

- సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 26న చలో హైదరాబాద్

- మండల వైద్యాధికారికి సీఐటీయూ నాయకుల వినతిపత్రం

కారేపల్లి, అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్ రాములు): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ, ఆరోగ్య సర్వేలు నిర్వహిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న హెల్త్ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు ఎల్లబోయిన రాధ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెల్త్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మండల వైద్యాధికారి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ, భవన నిర్మాణ, హమాలీ, ఆర్టీసీ, సింగరేణి, విద్యుత్ తదితర రంగాల కార్మికులకు వేతనాలు పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో జాప్యం చేస్తోందని విమర్శించారు. కనీస వేతన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జంగా కళ్యాణి, కార్యదర్శి వాంకుడోత్ కమల, జీపీ వర్కర్స్ యూనియన్ మండల



అధ్యక్షుడు శాతరాజుపల్లి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఎస్. నాగమణి, ఎం. కుమారి, జి. స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సందడితో కోట మైసమ్మ జాతర వైభవం

- దుకాణదారులకు ఆలయ చైర్మన్ పట్టాభిరామారావు భరోసా

- జాతరలో ఏ సమస్య వచ్చినా నేరుగా నా దృష్టికి తీసుకురండి

కారేపల్లి, అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్ రాములు): ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీశ్రీ కోట మైసమ్మ అమ్మవారి జాతర భక్తుల సందడి, ఉత్సాహం నడుమ వైభవంగా కొనసాగుతోంది. అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. జాతరకు వచ్చే భక్తుల కోసం వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేయడంతో పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. జాతర సందర్భంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా ఉంటానని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ పర్స పట్టాభిరామారావు భరోసా ఇచ్చారు. వ్యాపారులు తమ సమస్యలను ఇతరుల ద్వారా చెప్పించాల్సిన అవసరం లేదని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను సంప్రదించి తెలియజేయాలని సూచించారు. వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడటంతోపాటు, దుకాణదారులు ప్రశాంతంగా తమ వ్యాపారాలు నిర్వహించుకునేలా అందరూ పరస్పరం సహకరించుకోవాలని ఆయన కోరారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, భక్తులకు అవసరమైన వస్తువులు, సేవలు అందించడంలో వ్యాపారులు సహకరించాలని సూచించారు.జాతరను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించడంలో ఆలయ నిర్వాహకులు, వ్యాపారులు, భక్తుల భాగస్వామ్యం ఎంతో కీలకమని చైర్మన్ పేర్కొన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి మంచి అనుభూతి కలిగేలా ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నామని, వ్యాపారుల సమస్యలను కూడా



ప్రాధాన్యంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. దుకాణదారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నేరుగా తనను సంప్రదించవచ్చని చైర్మన్ భరోసా ఇవ్వడంపై వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందరి సహకారంతో కోట మైసమ్మ అమ్మవారి జాతరను విజయవంతంగా నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

నిజాయితీకి నిలువుటద్దం.. దొరికిన బైక్‌ను పోలీసులకు అప్పగింత!

- ఉసిరికాయలపల్లి 9వ వార్డు సభ్యుడు దారావత్ రమేష్ నాయక్ మానవత్వం

- బాధ్యతాయుతమైన చర్యపై స్థానికుల ప్రశంసలు

కారేపల్లి, అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్ రాములు): నలుగురికి ఆదర్శంగా నిలవాలంటే మాటలు కాదు.. చేతల్లో నిజాయితీ చూపాలని నిరూపించారు ఉసిరికాయలపల్లి 9వ వార్డు సభ్యుడు దారావత్ రమేష్ నాయక్. జాతరలో కనిపించిన ఓ ద్విచక్ర వాహనాన్ని బాధ్యతగా పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. ఇతరుల ఆస్తిపై ఆశపడకుండా, వాహనం యజమానికి చేరేలా చొరవ తీసుకున్న ఆయన చర్యపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీశ్రీశ్రీ కోట మైసమ్మ అమ్మవారి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో ఓ భక్తుడు తన ద్విచక్ర వాహనాన్ని జాతర ప్రాంతంలోనే మరిచిపోయి వెళ్లిపోయాడు. అదే సమయంలో పొలానికి వెళ్తున్న వార్డు సభ్యుడు దారావత్ రమేష్ నాయక్‌కు అక్కడే ఉన్న బైక్ కనిపించింది. వాహనం ఎవరిదో తెలియకపోయినా, యజమాని ఆందోళన చెందకుండా ఉండాలనే ఉద్దేశంతో రమేష్ నాయక్ వెంటనే స్పందించారు. సింగరేణి మండల పోలీస్ స్టేషన్ ఎస్సై బైరు గోపీకి ఫోన్ చేసి విషయం తెలియజేశారు. అనంతరం పోలీసుల సహకారంతో బైక్‌ను కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి అధికారులకు అప్పగించారు.

నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన చర్య

ప్రస్తుత రోజుల్లో ఇతరుల వస్తువులు కనిపిస్తే వాటిని సొంతం చేసుకోవాలనే ఆలోచనకు భిన్నంగా, దొరికిన బైక్‌ను పోలీసులకు అప్పగించడం ద్వారా రమేష్ నాయక్ తన బాధ్యతను





చాటుకున్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవ చేయడమే కాకుండా, నైతిక విలువలను ఆచరణలో చూపించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. చిన్న చర్యే అయినా సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తుందని, నిజాయితీ, మానవత్వం, బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉండాలని పలువురు అభిప్రాయపడ్డారు. దారావత్ రమేష్ నాయక్ చూపిన చొరవ యువతకు ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు ప్రశంసిస్తున్నారు.

వైరాలో కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష

- సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలి

- సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్ పిలుపు

సింగరేణి, అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్ రాములు): వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీతో పాటు పలు కీలక అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి సింగరేణి మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు. వైరా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ సమావేశంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియ తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు వంటి అంశాలపై ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సింగరేణి మండలంలోని ప్రతి సర్పంచ్ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరినట్లు



వెల్లడించారు. సింగరేణి మండల పరిధిలోని సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఉదయం 11 గంటలకు వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని సమావేశాన్ని విజయవంతం చేయాలని భూక్యా రంజిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

ఐదో రోజూ అంగరంగ వైభవంగా కోటమైసమ్మ జాతర!

- భక్తులకు మెరుగైన సౌకర్యాలు.. చైర్మన్ పర్సా పట్టాభి రామారావు ప్రత్యేక చొరవ, పోలీసుల పటిష్ట బందోబస్తు

కారేపల్లి, అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్ రాములు): ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన శ్రీ కోటమైసమ్మ తల్లి జాతర ఐదో రోజు అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టారు.

భక్తులకు సౌకర్యాలు.. పోలీసుల పటిష్ట భద్రత

జాతరకు విచ్చేసిన భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడంతో పాటు జాతర ప్రశాంతంగా జరిగేలా ఆలయ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. మరోవైపు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కారేపల్లి సీఐ నునావత్ సాగర్, ఎస్సై బైరు గోపి





నేతృత్వంలో పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లకుండా తగిన చర్యలు చేపట్టారు. ఆలయ ట్రస్ట్, పోలీస్ శాఖ సమన్వయంతో ఐదో రోజు జాతర భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగింది. జాతర నిర్వహణలో ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లతో పాటు పోలీసుల భద్రతా చర్యలు కీలకంగా నిలిచాయి. ఆలయ ఈవో కె. వెంకటయ్య మాట్లాడుతూ.. ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. సీఐ నునావత్ సాగర్, ఎస్సై బైరు గోపి నేతృత్వంలో పోలీస్ సిబ్బంది అందించిన సహకారంతో జాతరను ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు పగడాల మోహన్ కృష్ణ, పర్సా లలిత్ సాయి, ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాష్ శర్మ, భైరవభట్ల సాయిరాం శర్మ తదితరులు పాల్గొన్నారు.

కో-ఆప్షన్, నామినేటెడ్ పదవుల్లో సామాజిక ఉద్యమకారులకు అవకాశం కల్పించాలి-

- సయ్యద్ బషీరుద్దీన్ డిమాండ్



కోదాడ,అక్టోబర్ 24(భద్రాద్రి న్యూస్): మున్సిపల్ ఎన్నికలు ముగిసి 7, 8 నెలలు గడుస్తున్నప్పటికీ, ఇంతవరకు మున్సిపల్ కో-ఆప్షన్ మరియు ఇతర నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ ఊసే లేకపోవడంపై స్థానిక సామాజిక కార్యకర్త సయ్యద్ బషీరుద్దీన్ ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం భర్తీ చేయాల్సిన ఈ నామినేటెడ్ పదవులను, సమాజ సేవ పట్ల అంకితభావం ఉన్న వారితో త్వరితగతిన భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ కో-ఆప్షన్, గ్రంథాలయ కమిటీ వంటి పదవుల్లో క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలతో పాటు బీసీ సామాజిక వర్గాలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ రోస్టర్ నిబంధనలు ఉన్నాయని గుర్తుచేశారు. కేవలం రాజకీయ సమీకరణాలకే పరిమితం కాకుండా, సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగి, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూ పోరాడే సామాజిక ఉద్యమకారులకు, సోషల్ యాక్టివిస్టులకు ఈ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే మరియు మున్సిపల్ శాఖ తమ రాజకీయ విజ్ఞతను, సమర్థతను ప్రదర్శించి.. నిరంతరం ప్రజల్లో ఉండే పార్టీ కార్యకర్తలతో పాటు సామాజిక ఉద్యమకారుల సేవలను కూడా వినియోగించుకోవాలని కోరారు. ముందుచూపు, సామాజిక స్పృహ ఉన్న వ్యక్తులకు ఈ పదవుల్లో అవకాశం కల్పించడం ద్వారా స్థానిక సంస్థల బలోపేతానికి మరియు ప్రజా సంక్షేమానికి మరింత మేలు జరుగుతుందని సయ్యద్ బషీరుద్దీన్ (సోషల్ యాక్టివిస్ట్, కోదాడ) ఆశాభావం వ్యక్తం చేశారు.

పట్టభద్రులారా.. ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి!

- సింగరేణి మండలంలో 7 క్లస్టర్లలో ఉచిత ఓటరు నమోదు కేంద్రాలు

- నవంబర్ 6 చివరి గడువు.. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి

: డీసీసీ కార్యదర్శి బద్రు నాయక్



కారేపల్లి, అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్ రాములు): ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఏడు క్లస్టర్లలో ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ధరావత్ బద్రు నాయక్ కోరారు. మండలంలోని చీమలపాడు, మాణిక్యారం, సీతారాంపురం, భాగ్యనగర్, సింగరేణి, మాదారం, గేట్ కారేపల్లి క్లస్టర్లలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గెలుపే లక్ష్యంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఓటరు నమోదు గడువు 2026 నవంబర్ 6తో ముగియనున్నందున అర్హులైన పట్టభద్రులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని బద్రు నాయక్ విజ్ఞప్తి చేశారు.

కారేపల్లిలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఉచిత కేంద్రాలు!

- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాలతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నమోదు కార్యక్రమం.. నవంబర్ 6 చివరి గడువు



కారేపల్లి, అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్ రాములు): ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా ఏడు క్లస్టర్లలో ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ సింగరేణి మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూరి రాంబాబు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గెలుపే లక్ష్యంగా మూడు ఉమ్మడి జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులు సమష్టిగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా చీమలపాడు, మాణిక్యారం, సీతారాంపురం, భాగ్యనగర్, సింగరేణి, మాదారం, గేట్ కారేపల్లి ప్రాంతాల్లో ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

పట్టభద్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : పట్టభద్రుల ఓటరు నమోదులో ఇప్పటికే ఆలస్యం జరిగిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ వెంటనే తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు చేసుకోవడానికి 2026 నవంబర్ 6 చివరి తేదీ కావడంతో గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో పట్టభద్రులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సర్పంచ్ మేదరి టోనీ, జిల్లా నాయకులు గుగులోత్ భీముడు, కడియాల సుధాకర్,మాదారం కాంగ్రెస్ నాయకుడు అజ్మీర నరేష్, సురేందర్, ఈర్య, గాంధీ ఏసు, నాగవేణి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన కానిస్టేబుల్‌కు తోటి బ్యాచ్‌మెట్స్ ఆర్థిక సహాయం



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్) : విధి నిర్వహణలో భాగంగా వాహన తనిఖీలు చేస్తుండగా లారీ ఢీకొని గాయపడిన కానిస్టేబుల్ పి. రవికుమార్‌కు ఆయన తోటి బ్యాచ్‌మెట్స్ అండగా నిలిచారు. చికిత్స నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పి. రవికుమార్ వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో లారీ ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఆయన మోకాలి భాగంలో తీవ్ర గాయమైంది. దీంతో కొత్తగూడెంలోని గణేష్ టెంపుల్ ప్రాంతంలో ఉన్న వరుణ్ ఆసుపత్రిలో ఆయన మోకాలికి శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న 2009 బ్యాచ్ కానిస్టేబుల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్పందించారు. అసోసియేషన్ తరపున సభ్యులు చంద్రశేఖర్, మోహన్, జహీర్, లక్ష్మణరావు, సురేష్ తదితరులు రవికుమార్ చికిత్స కోసం తక్షణ ఆర్థిక సహాయంగా రూ.50,000 అందజేశారు. ఆపద సమయంలో తోటి కానిస్టేబుల్‌కు అండగా నిలిచిన 2009 బ్యాచ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సేవాభావాన్ని పలువురు అభినందించారు. తోటి ఉద్యోగి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
ఆదివారం
25 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం





లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలి

- **స్టేషన్ ఘన్‌పూర్‌లో సీఐటీయూ ధర్నా పోస్టర్ల ఆవిష్కరణ**
- **కార్మికులకు నెలకు రూ.30 వేల కనీస వేతనం ఇవ్వాలి**

స్టేషన్ ఘన్‌పూర్,అక్టోబర్ 24 : కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, కార్మికులకు నెలకు రూ.30 వేల కనీస వేతనం నిర్ణయించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న బహుళ రోజుల ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సివిల్ సప్లై యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ ఎదునూరి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించి, పీఆర్సీని వర్తింపజేయాలని కోరారు. హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ మండలిని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.అక్టోబర్ 26న జరిగే ధర్నాలో పథక కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు, విశ్వవిద్యాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పెన్షనర్లు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, రవాణా రంగ కార్మికులు, హమాలీలు పాల్గొననున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టల తిరుపతి, నీల శ్రీనివాస్, ఎడ్ల రాజు, ప్రవీణ్, పూర్ణచందర్, లాజర్, సారయ్య, భాస్కర్, ప్రభాకర్, లక్ష్మీ, భిక్షపతి, రాజకుమార్, రాజు, కుమార్, పరమేష్, యాదగిరి, అశోక్ పాల్గొన్నారు.

వనపర్తి పర్యాటక రంగానికి కొత్త కళ.. రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు

- **9 ప్రాంతాల్లో పర్యాటక సదుపాయాల కల్పనకు ఆమోదం**

వనపర్తి,అక్టోబర్24 :-
వనపర్తి నియోజకవర్గంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. నియోజకవర్గంలోని తొమ్మిది ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక, ప్రకృతి ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రూ.14 కోట్లతో ప్రతిపాదించిన పనులకు ఆమోదం లభించగా, తొలి విడతగా రూ.10 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఆయన వెల్లడించారు.యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ఈ మేరకు 2026అక్టోబర్ 19న జీవో ఆర్టీ నంబర్ 313 జారీ చేసినట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, చెరువులు, రిజర్వాయర్ల సుందరీకరణ, అవసరమైన చోట్ల బోటింగ్ సదుపాయాల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నారు.ప్రతిపాదిత అభివృద్ధి పనుల్లో భాగంగా వనపర్తి పట్టణంలోని తిరుమలయ్య గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం, గోపాల్‌పేట మండలంలోని బుద్దారం ఆలయ అభివృద్ధి, ఖిల్లా ఘణపురం మండలంలోని ఘణప సముద్రం సుందరీకరణతో పాటు బోటింగ్ సదుపాయం కల్పించడం ఉన్నాయి.అలాగే మామిడిమాడ నేరేడు చెరువు, వనపర్తి ఎంటీబీ ప్రాంతం, పెద్దమందడి మండలం వెల్టూర్ లోని వేణుగోపాల సముద్రం, చిన్నగుంటపల్లిలోని గుండ్ల చెరువు, శ్రీరంగాపురంలోని రంగసముద్రం అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వనపర్తి పట్టణంలోని గ్రంథాలయ హాల్‌ను కల్చరల్ సెంటర్‌గా అభివృద్ధి చేయనున్నారు.నియోజకవర్గంలోని చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. పర్యాటకుల రాక పెరిగితే స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది.పర్యాటక అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో వనపర్తి నియోజకవర్గంలోని పర్యాటక ప్రాంతాలకు మరింత గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు.



రైతుల సమస్యలపై రాజకీయం తగదు

- **అల్వాల కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్ రెడ్డి**

పెద్దమందడి,అక్టోబర్24 : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాజకీయాలకు వాడుకోవడం తగదని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామ కాంగ్రెస్ నాయకుడు జి. సుదర్శన్ రెడ్డి అన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా విద్యుత్ కొరత వల్లే పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.శనివారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలు ఎండిపోవడానికి గల కారణాలు, సాగునీటి ఇబ్బందులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం, సాగునీటి కొరత కారణంగా కొన్ని పొలాల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వివరించినట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు.గ్రామంలో సాగునీటి సమస్యను అధిగమించేందుకు కేఎల్ఐ కాలువల నుంచి వచ్చే నీటిని చెరువుకు మళ్లించేందుకు గ్రామ నాయకులు, యువకులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, పొలాలకు నీరందించుకునేందుకు గ్రామానికి అదనంగా మరో రెండు గంటల విద్యుత్ సరఫరా చేయాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. రైతుల విజ్ఞప్తిపై డీఈ ఎ. శ్రీనివాస్, ఏడీఈ శివశంకర్ రెడ్డి, ఏఈ ఆర్. హేమంత్ గౌడ్, లైన్‌మెన్ గోవర్ధన్ గౌడ్ సానుకూలంగా స్పందించి అంగీకరించినట్లు తెలిపారు. రైతుల సమస్యలను రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సుదర్శన్ రెడ్డి కోరారు. రైతులకు అండగా నిలిచి, వారి పంటలను కాపాడేందుకు అధికారులు, గ్రామస్థులు కలిసి పనిచేయాలని ఆయన అన్నారు.



వి.బి.జి. రామ్ జీ పథకం ద్వారా పనులు ప్రారంభించిన సర్పంచ్ బిల్లా యాదగిరి

వేలేరు, అక్టోబర్ 24
హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో వి.బి.జి. రామ్ జీ పథకం ద్వారా 40 నూతన వ్యక్తిగత ఇంకుడు గుంతలు మంజూరయ్యాయి. ఈ పనులను వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇంటి నుంచి వెలువడే వంటగది, బాత్రూమ్ వ్యర్థ జలాలతో పాటు వర్షపు నీటిని కూడా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకింపజేయవచ్చని వివరించారు. దీనివల్ల భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు నీటి వనరుల సంరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడంతో ఒకేసారి 40 కుటుంబాలకు వ్యక్తిగత ఇంకుడు గుంతలు మంజూరయ్యాయని తెలిపారు. మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండేలా ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, వార్డు సభ్యుడు సునీల్, ఆత్మ డైరెక్టర్ చంద్రమౌళి, సతీష్, సంపత్ రెడ్డి, రాజశేఖర్, శ్రావణ్, తిరుపతి, నరసయ్య, రమేష్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న అన్నపురెడ్డిపల్లి మండల విద్యాశాఖాధికారి ఆనంద్

- రజబ్ ఆలీ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాటర్ ఫిల్టర్ బహుకరించిన



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి మండలం, పెద్దిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రజబ్ ఆలీ నగర్ అటవీ ప్రాంతములోని ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ పర్యవేక్షించారు.. ఈ గ్రామములో చెలిమ నీరు మాత్రమే లభిస్తుంది, వర్షాకాలములో బురద చేరి మలినం అవుతుంది. అందువలన విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగు నీరు అందించుటకు ఒక వాటర్ ఫిల్టరను అందజేసారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు భూక్యా బాబూలాల్, ప్రత్యేక విద్యా వాలంటీరు సడియం బాలకృష్ణ, గ్రామస్థులు మడకం మహేష్ పాల్గొన్నారు.

పద్మశాలి నాయకుల విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

- లక్ష్మీనారాయణ బలవన్మరణంపై సమగ్ర విచారణ.. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ బలవన్మరణానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పద్మశాలి సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీ బిరుదురాజు రోహిత్ రాజ్‌ను కోరారు. ఈ మేరకు ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ కుమార్తె తన తండ్రి మృతికి దారితీసిన పరిస్థితులపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులను శిక్షించాలని కన్నీటిపర్యంతమవుతూ విజ్ఞప్తి చేశారు. పద్మశాలి సంఘం నాయకులు సైతం ఈ కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్పీని కోరారు. పద్మశాలి సంఘం నాయకులు, కుటుంబ సభ్యుల విజ్ఞప్తిపై స్పందించిన ఎస్పీ రోహిత్ రాజ్.. కేసును క్షుణ్ణంగా విచారించి వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. బాధ్యులు ఏ స్థాయిలో ఉన్నా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విచారణలో బాధ్యులుగా తేలిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని పేర్కొంటూ, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు వై.ఎస్. రావు, గుండు రవికుమార్, వేముల ప్రసాద్ బాబు, వేముల సతీష్, వేముల మధుకర్, ఇమంది ఉదయ్ కుమార్, పుట్టా శంకరయ్య, తోటకూర శ్రీనివాసరావు, పిండిపోలు కన్నయ్య, దోమల కిషోర్, బొమ్మ రామకిషోర్, దోమల ప్రవీణ్, పెగడ శంకర్, ఆడెపు నాగరాజు, రాగిణి వెంకటేశ్వర్లు, వేల శివ, వేల జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

- సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగాసీతారాములు యాదవ్



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 24 (భద్రాద్రి న్యూస్) : ఖమ్మం--వరంగల్--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొత్తగూడెం నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కొత్తగూడెంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోటా దేవీప్రసన్న అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఈ సమావేశానికి ఖమ్మం లోక్‌సభ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఎన్నికల ప్రచార వ్యూహాలు, అనుసరించాల్సిన కార్యాచరణపై నాయకులు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగాసీతారాములు యాదవ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.